# మలియుగం

**-శశీశర్మ**

అది బ్రహ్మలోకం. క్షణంలో వెయ్యోవంతు కూడా తీరిక లేకుండా సృష్టిమీద సృష్టి చేస్తూ బిజీగా వుండే బ్రహ్మదేవుడు కాస్త విశ్రాంతిగా పడుకుని వున్నాడు.

''అదిగో... అదిగో... ఆ బద్ధకమే వద్దంటున్నది. సృష్టికర్త అయికూడా బద్ధకిష్టగా మారిపోయారేమిటి స్వామీ'' అప్పుడే అక్కడికి వచ్చిన సరస్వతీదేవి అంది.

''అబ్బా! వుండు దేవీ. ఎన్నాళ్లకి విశ్రాంతి. కృతయుగం నుంచి అలా జీవులను సృష్టిస్తునే వున్నానుకదా. ఈ కలియుగ ప్రజల పుణ్యమా అని నాకు సృష్టించే పని తప్పిందని నేను సంతోషిస్తుంటే'' బ్రహ్మ బద్ధకంగా ఒళ్లు విరుచుకుంటూ అన్నాడు.

''అయ్యో సంబడం. బానే వుంది. ఇలా అయితే ఎలా''

''చదువుల తల్లివి నీకు తెలియనిది ఏముంది భారతీ. నువ్విచ్చిన విద్య ఈనాడు మానవుడిని ఎన్ని శిఖరాలు అధిరోహింపచేస్తోంది తెలుసా. ఇక బ్రహ్మ సృష్టితో ఈ జీవుడికి పనేముంది. పూర్వాపరాలు చూసి, కర్మలు బేరీజువేసి ఇంత కష్టపడి నేను సృష్టించే రోజులు ఏనాడో పోయాయి. స్త్రీపురుషుల కలయికవల్ల బిడ్డ పుట్టే రోజులు కలియుగం రోజునే పోయాయి సుమా''

''మరీ చెప్తారు స్వామీ'' వాగ్దేవి ఆశ్చర్యంగా ఏదో అనేంతలోపలే బ్రహ్మ అందుకున్నాడు.

''మరి? ఆర్టిఫిషియల్ ఇన్సెమినైజేషన్ పద్ధతులు, టెస్ట్ ట్యూబ్ బేబీల జననాలు, మగ తోడు లేకుండా కేవలం అతని వీర్యం బ్యాంకు నుండి తెచ్చుకుని పిల్లల్ని కనే విధానాలు... ఇవన్నీ ఆనాడే చూసాంకదా. మరి ఇప్పుడో? అసలు వీర్యం అవసరం కూడా లేకుండా మహిళాశక్తి విజృంభణ పుణ్యమా అని అవేవో కొత్త మాత్రలు కనిపెడుతున్నారట. అవి వేసుకుంటే చాలు కావాల్సినప్పుడు గర్భం ధరించవచ్చుట. బిడ్డను కనవచ్చుట. మరి అటువంటి ఆధునిక వైద్య విధానాలు ఈ మలియుగంలో అమలు పరుస్తుంటే ఇక ఈ బ్రహ్మతో పనేమిటి దేవీ. నా సంగతి సరే, నువ్వేమిటి వీణ వాయించి ఎన్నాళ్లయింది? ఏదీ నీ నాదస్రవంతి?''

''నా పరిస్థితి అడక్కండి స్వామీ. భూలోకవాసుల శబ్ద కాలుష్యం పుణ్యమా అని భరించలేనంత సౌండు నాకిక్కడ కర్ణపుటాలను తాకి నాకు శృతి, లయ జ్ఞానం పోగొట్టేట్టున్నాయి. అసలు శ్రావ్యమైన చక్కటి సంగీతం వాయించి ఎన్నాళ్లయింది'' వాగ్దేవి నిట్టూర్చింది.

''పాపం... వీ పరిస్థితి కూడా బాగా దిగజారిపోయింది దేవి. అవును... నేనూ ఈమధ్య వింటున్నాను. రకరకాల శబ్ద ప్రయోగాలు ఏమిటేమిటో పాశ్చాత్య, అశాస్త్రీయ సంగీత సమ్మేళనంట. వింత వింత వణకు జ్వరాల మూలుగులులాంటి పాటలట. వినడానికి కూడా వీలులేని బూతుమాటల ద్వంద్వార్థాల పద్యాలట. ఏమీ ఈ మలియుగం? ఎటు దారి తీస్తున్నది''

''స్వామీ! నా మనసు స్థిమితంగా లేదు. ఒక్కసారి వైకుంఠం వెళ్లి అత్తగార్ని, మామగార్ని చూసి వద్దాం పదండి''

''సరే పద...'' బ్రహ్మ సరస్వతులు వైకుంఠం వైపు కదిలారు.

''అప్పటిదాకా వారి సంభాషణ పొంచి వింటున్న ఒక నీడ వారి వెనకాలే వైకుంఠపురం చేరింది.

★★★

అది వైకుంఠపురం. తెల్లని పాలసముద్రంపై లక్ష్మి కాళ్లు వత్తుతుండగా శేషతల్ప శయనుడై చిద్విలాసుడై వుండాల్సిన మహావిష్ణువు పరిస్థితి మరోలా వుంది. కాళ్లు పట్టాల్సిన లక్ష్మి లేదు. తెల్లని పాల సముద్రం కాస్త నల్లనల్లగా మురికిగా వుంది. విష్ణువు ఏదో పరికరంవైపు పరీక్షగా చూస్తున్నారు.

''నమస్కారం తండ్రీ''

''ఆశీర్వదించండి మామయ్య'' అంటూ బ్రహ్మ సరస్వతులు ప్రవేశించారు. ఒక్కసారి ఉలిక్కిపడి సర్దుకు కూర్చున్నాడు శ్రీ మహావిష్ణువు.

''అదేమిటి తండ్రీ. నేను మీ అబ్బాయిని. ఇదిగో కోడలు. ఏమిటా తత్తరపాటు. అమ్మేది?''

''ఓ నువ్వా నాయనా! రా...రా. ఈమధ్య నమస్కారం అన్నమాట విని చాలాకాలమైందిలే. మొన్న కుబేరుడు తిరుపతిలో నా పేరు చెప్పి డబ్బులు బాగా వసూలు చేస్తున్నాడు కాబోలు. ఆ ధనగర్వం హెచ్చి నాకామధ్య కనిపించి చూసీ చూడనట్లు వెళ్లిపోయాడు. కనీసం నమస్సులు కూడా చెప్పలేదు. భూలోకవాసుల సంస్కారం మన సురలోకవాసులకు అబ్బిందన్నమాట అనుకున్నాను'' అన్నాడు హరి.

''అత్తయ్యేది మామయ్యా?'' సరస్వతి అడిగింది.

''మీ అత్తకూ నేనూ ఈ లోకం నచ్చట్లేదమ్మ. మాటిమాటికీ భూలోకం వెళ్లిపోతోంది. స్త్రీలు, పురుషులు అన్నివిధాల సమానమవి నా కాళ్లు వత్తడం ఏనాడో మానేసింది. ఆవిడకి ఇప్పుడు నా బాగోగులుకన్నా భూలోక రాజకీయ నాయకుల మంచిచెడ్డలు ఎక్కువైపోయాయి. ఎవరో ఒకరి ద్వారా మరొకరికి కోట్లు కోట్లు గుమ్మరిస్తోంది. ఈవిడ పెత్తనంకాదు కానీ ఈ స్కాములు, కుంభకోణాలు దినదిన ప్రవర్ధమానంగా వర్ధిలుతున్నాయి. కలికాలం నయం, ఏదో ఒకటి రెండు కోట్లు లంచం తీసుకుంటే కనీసం జైల్లోనైనా పెట్టేవారు. ఇప్పుడు ఉద్యోగాలకు రాజకీయాలకు కనీసం వందకోట్లు లంచం ఇవ్వాలన్నది కనీస అర్హతగా మారిపోయింది. అలా ప్రకటనలు కూడా ఇస్తున్నారు. కలియుగం కన్నా మలియుగం మరీ దారుణమైపోతోంది''

''నాన్నా మీరే అలా అంటే ఎలా? దర్మసంస్థాపనార్థాయా అని ఆనాడు అన్నారుకదా''

''ఓరి పిచ్చినాయనా. ఆనాడంటే అర్జునుడు నా బావమరిది. ఏదో అంటే విన్నాడు. కలికాలం మొదలుదాకా విన్నారు. కానీ ఇప్పుడు ధర్మం అంటే ఆ పదమే లేదంటున్నారు భూలోకవాసులు. నేనేం చేసేది? అప్పటికీ కలియుగం అంతానికి కల్కి పురుషుడిగా వెళ్లి జల ప్రళయాలు, కరువు కాటకాలు, భూకంపాలు సృష్టించాను కదా. చచ్చినవాళ్లు చావగా నిజానికి బాగుపడ్డవాళ్లే ఎక్కువమంది''

''అవును మామయ్యా'' సరస్వతి ఆశ్చర్యంగా అంది.

''అవునమ్మా. నిలువ నీడలేని పేద ప్రజలు ఈ జలప్రళయాలకు చనిపోయారుకానీ విరాళాలు, సహాయాలు పుణ్యమా అని అటు నాయకులు, ఇటు మధ్యవర్తులు బాగానే లాభపడ్డారు సుమా. ఆఖరికి ఆ కల్కి అవతారం కూడా శుద్ధ దండగ అనిపించిందనుకో'' విష్ణువు అన్నాడు చేతిలోని పరికరంకేసి చూస్తూ.

''నాన్నా ఏమిటది?'' బ్రహ్మ అడిగిన ఆ ప్రశ్నకు విష్ణువు కాస్త సిగ్గుపడ్డాడు.



''నవ్వకు నాయనా. ఇది సూపర్ మైన్యూట్ సెల్యులర్ ఫోన్. మలియుగ ప్రజలు గ్రహాంతరవాసులతో మాట్లాడడానికి కనుక్కున్న శ్రవణ పరికరంట. మన భటుడు గ్రహాంతరవాసులు ఒక గ్రహం మీద నుండి మరొక గ్రహంకి ఏదో నౌకలో పోతూ పారేసుకుంటే నాకు తెచ్చిచ్చాడు. బావుందికదా అని చూస్తున్నాను బ్రహ్మ. ఎంతైనా మానవుడు నన్ను మించిపోయాడు''

''మామయ్యా! మీ పాలసముద్రం నల్లగా అయిందేమిటి?'' సరస్వతి అడిగింది.

''అదా! వాతావరణ కాలుష్యం అమ్మా. భూలోకం చుట్టూ వుండే ఓజోన్ పొరేదో పూర్తిగా పోయిందట. సౌరశక్తి అంటూ మన సూర్యుడ్ని పూర్తిగా దోచేసారు భూలోక ప్రజలు. ఆ శక్తి, ఈ శక్తి అనుకుంటూ కనిపించిన చోటల్లా పరిశ్రమలు, కార్ఖానాలు కట్టేస్తున్నారు. ఆ పొగ వ్యర్థపదార్థం. ఇదిగో సరాసరి పాల సముద్రాన్ని తాకి కలుషితం చేసేసాయి.''

''మరి తరుణోపాయం ఏమిటి తండ్రీ?''

''తరుణోపాయం ఏముందీ? నువ్వు సృష్టి, నేను లయ, ఆయన స్థితి చేయడం పూర్తిగా ఆపేయాలంతే.''

అప్పుడే అక్కడికి వచ్చాడు పరమశివుడు. శివుడికి బ్రహ్మ విష్ణువులు నమస్కరించారు. శివుని ప్రక్కన ఒక అందమైన అమ్మాయిని చూసాడు బ్రహ్మ.


''స్వామీ! ఈమె ఎవరు? నేనెన్నడూ సృష్టించిన గుర్తులేదు''


''ఈమె...ఈమె కంప్యూటర్ పార్వతి. మానవులు డూపర్ కంప్యూటర్ అనే పరికరంతో మానవులని సృష్టిస్తున్నారట కదా. నా అనుచరుడు ఈమెను ఇందాకనే తీసుకువచ్చాడు. ఒక శాస్త్రజ్ఞుడు కంప్యూటర్ సాయంతో ఈమెను మలిచాడుట. ఈమె గ్రహాలన్నీ తిరుగుతుంటే నంది చూసి బావుందని తీసుకువచ్చాడు'' శివుడు అన్నాడు.

''దేవా! మరి అమ్మవారికి కోపం రాలేదా? ఇప్పటికే నీకిద్దరు భార్యలు''

బ్రహ్మ మాట పూర్తి కాకుండానే పకపకా నవ్వాడు శివుడు.

''ఇంకా ఏ యుగంలో వున్నావయ్యా బ్రహ్మయ్యా. ఇది మలికాలం. ఒక పురుషునికి భార్యతో పనేమిటి? ఎవరైనా సరే. కాంట్రాక్టు పద్ధతే. ఈమెతో నాకు ఒక వారం కాంట్రాక్ట్. తర్వాత భూలోకం పంపేస్తాను.




తండ్రీకూతుళ్ల పెళ్లిళ్లు, అన్నాచెల్లెల ప్రేమ మైకం లాంటి సినిమాలు గురించి వినట్లేదా?''

''శివ శివా! పరమశివా! లయకారకా! మీరేనా ఆ మాట అంటున్నది? మానవతా సంబంధాలు అంత నీచమైపోయాయా? ప్రకృతి, పురుషులని విన్నా జగదాంబని అంటారే? ఆ మాటకే అర్థం మారిపోయిందా? ఏమిటీ వైపరీత్యం? బ్రహ్మ విష్ణు మహేశ్వరులైన మీరే భూలోకవాసుల స్థితికి దిగజారిపోయారా? మీరు సృష్టించిన వారి సృష్టినే ఎదుర్కో-లేకపోతున్నారా? మానవుడి పరిజ్ఞానం ముందు ఆఖరికి మీరు కూడా ఓడిపోతున్నారా? నేనిచ్చిన విద్య సారం ఇదా? పశువులకి, పక్షులకి, చెట్లకి, పుట్లకి లభించని ఈ అపూర్వమైన విద్య మానవుడికి లభిస్తే అతను తన మనుగడకే ఒక అర్థం చెప్తాడని ఆశించానే. సత్య సమాజం, సంస్కా-రవంతమైన జీవితం, అందరికీ ఉపయోగపడే శాస్త్ర పరిజ్ఞానం ఇవన్నీ కనుగొంటాడని ఆశపడ్డానే తప్ప ఆ తెలివంతా ప్రకృతినే ప్రశ్నించే స్థాయికి ఉపయోగిస్తాడని నేను కలనైనా ఊహించలేదే'' సరస్వతి భోరున విలపించసాగింది.

''అందుకే భారతీ! ఈ మానవ ప్రవర్తన, మితిమీరిన వినాశకరమైన తెలివితేటలు భరించలేకే మా విలువలు లేవని తెలిసీ నేను సృష్టించడం మానేసాను. నా అవసరం వారికి లేదు. అలాగే ధర్మం నిలబెట్టే విష్ణువు, జగత్తుని లయకారకంగా నడిపే శివుడు తమ తమ పదవులు, బాధ్యతలు ఏనాడో త్యజించారు. ఇక ఇప్పుడు నీ వంతు. భారతీ! మానవుడికిచ్చిన విద్యనంతా వెనుకకి లాగేసుకో: వారికి విద్య వికసింపజేయాలిగానీ తమ వినాశనానికి దారి తీసేలా చేయకూడదు. ధర్మం, నీతి, నియమంలేని ఈ మానవుని శాస్త్రీయ పరిజ్ఞానం ఎవరికోసం? ఎందుకని? భారతీ! అందుకనే విద్య వరం. నువ్వు వెంటనే తిరిగి తీసుకో'' బ్రహ్మదేవుడు అన్నాడు. సరస్వతి కళ్లు మూసుకుంది. ఆమె కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి. ఆమె చెయ్యెత్తబోయేంతలో అప్పటిదాకా వారి సంభాషణ వింటున్న ఆ నీడ ఆమె ముందుకు వచ్చి ''అమ్మా వాగ్దేవీ! ఆగు తల్లీ'' అంటూ ముందుకు పరుగెత్తుకు వచ్చింది.

''ఎవర్నువ్వు?'' ముక్తకంఠంతో ప్రశ్నించారు త్రిమూర్తులు.

''మహానుభావుల్లారా! నా తండ్రుల్లారా! నేను మానవుడిని. నా శాస్త్రీయ పరిజ్ఞానంతో మీ లోకాలు చూడడానికి వచ్చి చాటున వుండి మీ మాటలన్నీ విన్నాను. నన్ను క్షమించండి ప్రభూ. ఈ అల్పుడ్ని, ఈ మూర్ఖుడిని క్షమించండి. ఆ వాగ్దేవి ఇచ్చిన విద్యాధనాన్ని దుర్వినియోగం చేసుకుంటున్న ఈ మానవుడ్ని క్షమించండి. తెలివితేటలు నా సొత్తన్న అహంకారంతో అత్యంత ఆధునిక విజ్ఞానం సంపాదించి అవి సమాజ సేవకు, మానవ ప్రగతికి, నైతిక విలువలకి ఉపయోగించాల్సిందిపోయి మూర్ఖంగా ప్రకృతి నియమాల్నే ఎదిరించే స్థాయికి వచ్చాను. మోడరన్ టెక్నాలజీ నా చేతిలో ఉందని గర్వపడ్డానేగానీ మానవతా సంబంధాలన్నిటినీ చెరిపి వేస్తున్నానని యోచించలేదు. ఇప్పుడు మా లోకంలో సైన్సు వుంది. కానీ సమాజంలేదు. పరిజ్ఞానం వుంది కానీ పవిత్రతలేదు. మాడర్నిజం వుంది. కానీ మానవత్వంలేదు. మాకన్నా ఒక నీతి నియమంతో బ్రతికే పశుపక్ష్యాదులే మేలు. సృష్టి, స్థితి, లయ కారకుల్లారా! ఈ మలియుగాన్ని ఒక మంచి యుగంగా మార్పు చేయండి. దయచేసి మీమీ కర్తవ్యాలు విస్మరించ వద్దు. మేము అల్పులం. కాస్త తెలిస్తేనే సమస్తం తెలుసనే అజ్ఞానులం. అమ్మా వాగ్దేవి! నువ్వు నీ విద్యను మానుండి తీసుకోవద్దు. నువ్వు సక్రమంగా ఇచ్చావు. మేమే దాన్ని సరైన రీతిలో ఉపయోగించుకోలేదు. తల్లీ! ఇదే నా వాగ్దానం. నువ్విచ్చిన విద్య, బ్రహ్మ ఇచ్చిన జన్మ, హరి ఇచ్చిన ధర్మం, శివుడిచ్చిన నియమం ఈ నాటినుండి మానవ మనుగడకు, ఈ జన్మ సార్థకతకు, సమాజసేవకు ఉపయోగిస్తాను. తిరిగి ధర్మం నాలుగు పాదాలపై నడిచేటట్లు చేస్తాను. నా ఈ శాస్త్రీయ విజ్ఞానం, మానవతా విలువలను మరింత పటిష్టం చేయడానికి ఉపయోగిస్తాను. నన్ను నమ్ము తల్లీ'' అని మానవుడు హడావుడిగా నిష్క్రమించాడు.

త్రిమూర్తులు చిన్నగా నవ్వుకున్నారు.

★



## విజయశాంతి బూతు జోకు

షూటింగ్ స్పాట్‌లో అందరితో కలిసిపోయి అప్పుడప్పుడు బూతు జోకులు కట్ చేసే హీరోయిన్స్‌లో రోజాది మొదటి స్థానం కాగా రెండో స్థానంలో విజయశాంతి వుంటుంది. విజయశాంతి బూతు బాగానే మాట్లాడుతుంది. ఈమధ్య విజయశాంతితో సినిమాతీసి రిలీజ్‌కి సిద్ధం చేసిన ఓ నిర్మాత ఆమె నటించే మరో సినిమా షూటింగ్ స్పాట్‌కెళ్లి, మాటల మధ్య 'మన సినిమాకి ఏం పేరు పెట్టాలో తోచడం లేదు. ఏదైనా 'మొగుడు' అనే పదం వచ్చేలా పేరు పెడితే బాగుంటుందనుకుంటున్నాను' అన్నాడు. విజయశాంతి వెంటనే నవ్వుతూ'అయితే 'ఇంట్లో సొంత మొగుడు-ఎదురింట్లో రంకు మొగుడు' అని పేరు పెట్టండి' అందిట. ఆ నిర్మాత ఏడవలేక నవ్వాడుగానీ పక్క-వాళ్లు మాత్రం విజయశాంతి బూతు హ్యూమర్‌కి హీహీగా నవ్వుకున్నారు.

-జె.వి.బాబు